సాక్షి అనకాపల్లి

బుధవారం : 1 : ఫిబ్రవరి : 2023



సొంత భవనంలోకి.. 8లో

స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన ఔషధ తనిఖీ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు.



ఘనంగా వైఎస్సార్ తీర్థం

అమీన్‌సాహెబ్‌పేటలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీర్థం ఘనంగా జరిగింది. 8లో

వాతావరణం

అనకాపల్లిటౌన్ : రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 31.2 నుంచి 31.8 డిగ్రీలు, గాలిలో తేమ శాతం 78 నుంచి 81, గాలి గంటకు 2 కిలో మీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

24 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

కోటవురట్ల: మండలంలోని రెండు పాఠశాలలకు చెందిన 24 మంది ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన మంగళవారం కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్, కోటవురట్లలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు చోట్ల ఉపాధ్యాయుల డైరీలు, పాఠ్యాంశాల బోధనా ప్రణాళికలను పరిశీలించి సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్యం పట్ల కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ హెచ్‌ఎం నాగేశ్వరరావు, మరో 11 మంది ఉపాధ్యాయులకు, కోటవురట్ల బాలికోన్నత పాఠశాలలోని హెచ్‌ఎం ఏసుదాసు, మరో 11 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బోధన కోసం కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులకు హెచ్చరికలు, షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, ఎంఈవో పెన్నాడ అప్పారావు పాల్గొన్నారు.

వివాహితను వేధించిన వీఆర్వోపై కేసు



విచారణ జరుపుతున్న డీఎస్పీ ప్రవీణ్ కుమార్

పాయకరావుపేట: వివాహితను లైంగికంగా వేధించిన పి.ఎల్.పురం వీఆర్వోపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి,యలమంచిలి కోర్టుకు తరలించినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. ఇంటి స్థలం కోసం గ్రామానికి చెందిన దళిత మహిళ దరఖాస్తు చేసుకుంది. స్థలం మంజూరు చేయాలంటే తన కోరిక తీర్చాలని వీఆర్వో డి.ఎస్.వి.ఎస్. భాస్కరనాయుడు వేధిస్తున్నట్టు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ప్రవీణ్ కుమార్ మంగళవారం గ్రామంలో విచారణ జరిపారు. వీఆర్వోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయని, ఆ గ్రామానికి వేరే వీఆర్వోను నియమిస్తున్నామని ఎమ్మార్వో కె.జయప్రకాష్ తెలిపారు.

ఔషధ తనిఖీ అధికారి కార్యాలయం ప్రారంభం



కార్యాలయ ప్రారంభోత్సవంలో అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రావు

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన ఔషధ తనిఖీ అధికారి కార్యాలయాన్ని వర్చువల్ విధానంలో అమరావతి నుంచి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సీపట్నంలో జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 22 ఔషధ తనిఖీ అధికారుల కార్యాలయాలను నిర్మించినట్టు చెప్పారు. మంత్రి రజని 12 తనిఖీ కేంద్రాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారన్నారు. నర్సీపట్నంలో ఔషధ తనిఖీ అధికారి కార్యాలయం సుమారు రూ.25 లక్షలతో నిర్మించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్, డ్రగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

2న గ్రహణ మొర్రి ఉచిత వైద్య శిబిరం

మునగపాక: గ్రహణ మొర్రి, గ్రహణ శూల సమస్యలున్న దివ్యాంగుల కోసం అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో ఫిబ్రవరి 2న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మునగపాక భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎల్.సుమతి తెలిపారు. 6 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి, సంబంధిత వ్యాధితో ఇబ్బందులు ఎదుర్కుంటున్న వారి లోపాలను సరిచేసి, శస్త్రచికిత్స నిర్వహిస్తారన్నారు. అనంతరం మాట్లాడడంలో శిక్షణ ఇవ్వడంతో పాటు, దంతాల అమరిక సరిచేస్తారని పేర్కొన్నారు. బసవతారకం స్మైల్ ట్రైన్ (బీఎస్‌టీసీ), ఏపీ సమగ్ర శిక్ష సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైజాగ్‌కు జై



- రాజధాని విశాఖ అని సీఎం జగన్ ప్రకటన
- త్వరలోనే తాను షిఫ్ట్ అవుతానని స్పష్టీకరణ
- సర్వత్రా ఆనందోత్సాహాలు, జేజేలు
- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకాలు



ఉత్తర నియోజకవర్గంలో సంబరాలు

సాక్షి, విశాఖపట్నం: మా రాజధాని విశాఖే.. త్వరలోనే సుందరి నగరి రాజధానిగా మారబోతోంది. రాబోయే నెలల్లో నేనూ అక్కడకు మారబోతున్నాను' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఉత్తరాంధ్రవాసులను ఆనందడోలికల్లోను, సంభ్రమాశ్చర్యాల్లోను ముంచెత్తుతోంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ (జీఐఎస్) సన్నాహక సదస్సులో ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ సంచలన ప్రకటన చేశారు. వాస్తవానికి విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని రెండేళ్ల క్రితమే ఆయన అసెంబ్లీ వేదికగా పలుమార్లు చెప్పారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో మరే నగరానికి లేనంత విశిష్టత, భౌగోళిక స్వరూపం, చారిత్రక నేపథ్యం, రైలు, రోడ్డు, విమాన, సముద్ర రవాణా సౌకర్యాలు, పోర్టులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు విశాఖకు ఉన్నాయి. సౌమ్య స్వభావం కలిగిన ప్రజలు, ఎక్కడి వారినైనా అక్కున చేర్చుకునే నైజం ఇక్కడి వారి సొంతం. ఆదాయం వనరులు పుష్కలంగా ఉన్న, ఏడాది పొడవునా అనుకూలమైన వాతావరణం కలిగిన, ప్రకృతి రమణీయతతో అలారారే అతి సుందర నగరం. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, విద్య, వైద్యర ంగాల్లోనూ అభివృద్ధి చెందిన సిటీ విశాఖ. దేశంలో అభివృద్ధి చెందిన టాప్ 10 నగరాల్లో వైజాగ్ ఒకటి. ఇలా ఒకటేమిటి? చెప్పుకుంటూ పోతే పరిపాలన రాజధానికి అవసరమైన అన్ని వనరులూ, విశిష్టతలు, సుగుణాలు ఈ మహా నగరానికి ఉన్నాయంటూ అనేకమంది మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నగర వైశిష్ట్యాన్ని కొనియాడారు.

కొన్నాళ్లుగా ఎదురు చూపులు

విశాఖ రాజధాని ఎప్పుడవుతుందా? అంటూ విశాఖ వాసులే కాదు.. ఉత్తరాంధ్ర ప్రజలు కూడా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర విశాఖ పరిపాలన రాజధానితో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశగా ఉన్నారు. కొత్తగా ఈ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు, ఐటీ సంస్థలు ఏర్పాటై ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్న విశ్వాసంతో ఉన్నారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చేయడం ద్వారా విశ్వసనీయతకు మారుపేరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖతో పాటు, ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

సంబరాలు.. ఆనందోత్సాహాలు..

మంగళవారం సీఎం వైఎస్ జగన్ 'త్వరలో విశాఖ మా రాజధాని' అంటూ చేసిన ప్రకటనతో ఆనంద పరవశులైన నగర వాసులు సంబరాలు జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు. జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. జై విశాఖ.. జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి ప్రకటనతో రెండేళ్లుగా ఎదురు చూస్తున్న తమకు ఇక రాజధాని రావడమే తరువాయి అన్న నమ్మకం, సంతోషంతో ఉన్నారు.

నేటి నుంచి విజయోత్సవాలు



విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్తరాంధ్రలో ఉన్న యువత, ప్రజలంతా కోరుకునే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ నుంచి రాష్ట్ర రాజధాని విశాఖే అని ప్రకటించి.. అందరిలోనూ ఉత్సాహం నింపారు. కొన్నాళ్లుగా విశాఖ పరిపాలన రాజధాని కావాలని ఇక్కడి ప్రజలు శాంతియుత కార్యక్రమాలు చేపడుతున్నారు. అఖిలపక్షంతో పాటు ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీతో కలిసి వైఎస్సార్ సీపీ అనేక కార్యక్రమాలు నిర్వహించి.. ప్రజలకు అవగాహన కల్పించింది. బుధవారం నుంచి అన్ని నియోజకవర్గాల్లో పార్టీ తరఫున సంబరాలు నిర్వహిస్తాం.

– పంచకర్ల రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం



సుప్రీంకోర్టులో కూడా మూడు రాజధానులకు అనుకూలంగా తీర్పు వస్తుందని భావిస్తున్నాం. రాష్ట్ర పునర్విభజన చట్టంలో అమరావతినే రాజధాని చేయాలనేది ఎక్కడా లేదు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శివరామకృష్ణన్ కమిటీ పరిపాలన వికేంద్రీకరణతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పింది. రాజ్యాంగపరమైన అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రమంతా బాగుండాలని ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ కోరుకుంటోంది. తక్కువ ఖర్చుతో మిగతా రాష్ట్రాల రాజధానులకు దీటుగా విశాఖ అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా పరిపాలన సాగించే అధికారం సీఎంకు ఉంది.

– లజపతిరాయ్, చైర్మన్, ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సీతమ్మధార: ఏప్రిల్ నుంచి విశాఖ రాజధానిగా పరిపాలన సాగిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు బర్కత్ ఆలీ, సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కటారి అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథ్, మహ్మద్ ఫరూఖీ, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, రత్నాకర్, రాష్ట్ర డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రుల్లో ఉత్సాహం



రాష్ట్ర రాజధాని విశాఖపట్నం అని దేశ రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి వై.ఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం శుభపరిణామం. త్వరలోనే విశాఖ నుంచి పరిపాలన కొనసాగిస్తామని, తాను కూడా విశాఖకు నివాసం మార్చుకుంటున్నానని ప్రకటించడం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఉత్సాహం నింపింది.

– పాకా సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు, వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక

పెట్టుబడులు పెరుగుతాయి..



పరిపాలన రాజధాని వస్తే విశాఖలో పెట్టుబడుల వేగం ఊపందుకుంటుంది. అన్ని విధాలా ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. మౌలిక వసతులు మరింత పెరుగుతాయి. విమానయాన కనెక్టివిటీ కూడా వృద్ధి చెందుతుంది. రాజధాని అయితే ప్రపంచ దేశాల్లో విశాఖ నగరానికి మరింతగా గుర్తింపు లభిస్తుంది.

– ఆర్‌ఎల్ నారాయణ, చైర్మన్, ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ

రాజధానితో మంచి జరుగుతుంది..



విశాఖ రాజధానితో ఈ ప్రాంతానికి అంతా మంచే జరుగుతుంది. రాజధానికి కావలసిన అన్ని వనరులు, మౌలిక సదుపాయాలు విశాఖలో ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలూ ఉన్నాయి. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన, అందమైన ఏకైక సిటీ విశాఖే. ఇంతటి ప్రశాంతత కలిగిన నగరం దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే ఉండదంటే అతిశయోక్తి కాదు.

– పైడా కృష్ణప్రసాద్, అధ్యక్షుడు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్

యువతకు ఉద్యోగాలు దక్కుతాయి



విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర వాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరినట్లే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనతో రాజధాని తరలివస్తుందనే నమ్మకం కలిగింది. పేరొందిన విద్యా సంస్థలు ఇక్కడకు వస్తాయి. యువతకు ఉద్యోగాలు దక్కుతాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి పూర్తిగా వలసలు తగ్గుతాయి. ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు జరుగుతుంది. దీన్ని ప్రతి ఒక్కరూ హర్షించాల్సిందే..

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కమిటీ కౌన్సిలర్

ఏలేరు కాల్వకు మహర్దశ

- కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో కాల్వ అభివృద్ధి పనులు
- రూ.5.50 కోట్లతో శ్రీకారం
- రూ.3 కోట్లతో పూడిక తొలగింపు, గట్లు పటిష్టత
- రూ.2 కోట్లతో పాములవాక వద్ద వంతెన నిర్మాణం, రక్షణ గోడల ఏర్పాటు
- ప్రతి రోజూ 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేసేలా కాల్వ మరమ్మతులు





పాములవాక వద్ద ఏలేరు కాలువ పై రూ.2 కోట్లతో నిర్మిస్తున్న వంతెన (ఇన్‌సెట్) ఏలేరు కాలువలో ప్రవహిస్తున్న నీరు

నాతవరం: వేసవిలో విశాఖ వాసులకు తాగునీరు, పరిశ్రమలకు నీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఏలేరు కాలువ ద్వారా ప్రతీరోజూ 350 నుంచి 400 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఏలేరు కాలువను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.5.50 కోట్లు మంజూరు చేయడంతో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టారు.

కాలువ పటిష్టానికి చర్యలు

కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం వరకు 153 కిలోమీటర్ల పొడవున ఏలేరు కాలువ ద్వారా నీరు తరలిస్తున్నారు. ప్రస్తుతం ప్రతీరోజూ 200 క్యూసెక్కులు నీటిని మాత్రమే విశాఖపట్నం తరలిస్తున్నారు. వచ్చే వేసవి దృష్ట్యా జీవీఎంసీ ప్రజలకు, స్టీల్ ప్లాంటు, గంగవరం పోర్టు, ఎన్టీపీసీ, ఏపీఐఐసీలో వివిధ పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా 350 నుంచి 400 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. దీని కోసం ఏలేరు కాలువ 153 కిలో మీటర్ల పొడవున పూడిక తీసి, నీరు వేగంగా, అదనంగా ప్రవహించేలా చర్యలు చేపడుతున్నారు. దీని కోసం రూ.3 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే తుఫాన్ల సమయంలో పలు చోట్ల కాలువ శిథిలమై, ప్రమాదాలకు నిలయంగా మారింది. అలాంటి చోట్ల గ్రావెల్ వేసి ప్రమాదాలు జరగకుండా చేసేందుకు మరో రూ.50 లక్షలు మంజూరు చేసింది. నాతవరం, కోటవురట్ల మండలాల సరిహద్దులో పాములవాక వద్ద ఏలేరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఇక్కడ వంతెన లేకపోవడంతో భారీ వర్షాల సమయంలో నీటి ఉధృతికి ఏలేరు కాలువ దెబ్బతింటోంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధులతో కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఉన్న ఏలేరు కాలువ మరమ్మతు పనులను జీవీఎంసీ అధికారులు, ఏలేరు ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో ముమ్మరంగా చేస్తున్నారు. మార్చి నాటికి పనులు పూర్తి చేసి, ఏలేరు కాలువ ద్వారా అవసరాలకు తగ్గట్టుగా నీరు తరలిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఏలేరు కాలువ ద్వారా రోజూ అందిస్తున్న నీటి వివరాలు

	ఎంజీడీల్లో
వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు	: 45
జీవీఎంసీకి తాగునీరు	: 50
ఏపీఐఐసీకి	: 0.06
గంగవరం పోర్టు	: 0.02
ఎన్టీపీసీకి	: 0.07
కశింకోట ఆర్‌డబ్ల్యూఎస్	: 0.02
పాయకరావుపేట ఆర్‌డబ్ల్యూఎస్	: 0.05
అన్నవరం పంపానదికి	: 50

నీటి సమస్య లేకుండా చర్యలు

విశాఖపట్నం జీవీఎంసీ పరిధి, కశింకోట, పాయకరావుపేట ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. విశాఖపట్నం జిల్లాలో ఉన్న పలు పరిశ్రమలతో పాటు స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు జాగ్రత్తలు తీసుకున్నాం. కాలువను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, మరింత వేగంగా నీరు ప్రవహించే విధంగా బాగు చేస్తున్నాం.

– ఏడుకొండలు, ఏలేరు ఈఈ

చిరు ధాన్యాల సాగుపై దృష్టి



మినప పంటను పరిశీలిస్తున్న మధుమోహన్

కె.కోటపాడు: చిరు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏవో ఎస్. మధుమోహన్ సూచించారు. వారాడలో మంగళవారం నిర్వహించిన క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో భారతదేశం ప్రతిపాదించిన ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ కార్యక్రమానికి 45 దేశాలు అంగీకారం తెలిపినట్టు ఆయన చెప్పారు. ఈ ఏడాది చిరు ధాన్యాల సాగును ఎక్కువగా చేపట్టాలన్నారు. రైతులు అధిక దిగుబడి పొందేందుకు పొలంబడి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ 14 వారాల పాటు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం యడ్లవానిపాలెంలో సాగులో ఉన్న మినుము పంటను పరిశీలించారు. చోడవరం ఏడీ రవీంద్రనాథ్, ఏడీఏ వసంతకుమారి, ఏవో తులసీ, మండల వ్యవసాయశాఖాధికారి సోమశేఖర్, ఏఈవో లైలాదేవి, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ నాగ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు

- జేసీ కల్పనా కుమారి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

కశింకోట: ఆత్మ విశ్వాసం ఉంటే అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జేసీ కల్పనా కుమారి అన్నారు. ఆ దిశగా విద్యార్థినులు కృషి చేయాలని తెలిపారు. స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వాభిమాన్(ఆత్మ గౌరవం) సామాజిక సమస్యలపై బాలికలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమతుల ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మహిళలు ఎక్కువగా రక్తహీనత బారిన పడుతున్నారని, రక్తహీనత నివారణకు ఉపకరించే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, వీటి వల్ల కలిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. పలు అంశాలపై బాలికలను ప్రశ్నించి, సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వడంతో ప్రశంసించారు. అనంతరం ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, మండల వైస్ చైర్మన్లు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, సర్పంచ్ మంత్రి జయరజని, తహసీల్దార్ బి.సుధాకర్, ఎంపీడీవో కొంకి అప్పారావు, హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి, పీడీలు పెంటకోట కమల, వి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామి 750వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామి



పూలు, పండ్లతో అలంకరణ

- ఫల, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ
- నేడు స్వామివారి తిరువీధోత్సవం

చోడవరం: స్థానిక కేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామివారి 750వ వార్షిక బ్రహ్మోత్సవాలను వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ, దేవదాయశాఖ భారీ ఏర్పాట్లు చేశాయి. గర్భాలయంలో శ్రీదేవి,భూదేవి సమేతుడైన కేశవస్వామికి ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో, ఆలయం లోపల పూలు, రకరకాల పండ్లు, మొక్కజొన్నలతో అందంగా అలంకరించారు. ఉత్సవాల ప్రారంభం రోజున ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, వాస్తుపూజ, అగ్నిప్రతిష్ఠాపన, గరుడ హోమం నిర్వహించారు. ఫిబ్రవరి 1వ తేదీ బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, స్వామివారి తిరువీధి ఉత్సవం, అనంతరం రాత్రి 7గంటలకు కల్యాణోత్సవం జరుగుతుంది. 2వ తేదీన ఊంజల్ సేవ, 3న పండిత సత్కారం, తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు వారి ప్రత్యేక కార్యక్రమాలు, 4న ప్రధాన హోమం, అన్నమాచార్యుల సంకీర్తన కార్యక్రమం, 5న స్వామివారి నాగవల్లి వసంతోత్సవం, 6న పుష్పోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులకు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు, ఇతర సదుపాయాలు కల్పించామని, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశామని చైర్మన్ అలమండ ఈశ్వరరావు చెప్పారు.

క్లుప్తంగా

మద్యం దుకాణంలో చోరీ కేసులో ఇద్దరికి జైలు

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు రెండు సంవత్సరాల ఆరునెలలు జైలు శిక్ష విధిస్తూ స్థానిక అడిషనల్ సబ్ న్యాయమూర్తి డాక్టర్ హెచ్.అమరరంగేశ్వరరావు మంగళవారం తీర్పునిచ్చారు. పట్టణ సీఐ దాడి మోహనరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది మే 10వతేదీ రాత్రి పట్టణంలో విజయరామరాజుపేట ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగినట్టు దుకాణం సూపర్‌వైజర్ ఉగ్గిన భగవాన్ పోలీసులను ఆశ్రయించాడు. అప్పటి సీఐ లంక భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ మరుసటి రోజు బొత్స అలియా రాజు, దొడ్డి తిమోతిలను అదుపులోకి తీసుకొని రూ.3,41,440 నగదు, క్యాష్‌బాక్స్, ట్యాబ్ రికవరీ చేసుకొనిపై ఇద్దరినీ రిమాండ్‌కు పంపించారు. ఈ కేసును అడిషనల్ పీపీ బి.త్రినాథరావు వాదోపవాదాల పిదప న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారని సీఐ చెప్పారు.

గల్లంతైన విద్యార్థి మృతి



ఒడ్డుకు కొట్టుకు వచ్చిన రేవంత్ మృతదేహం

ఎస్.రాయవరం : రెండు రోజుల క్రితం రేవుపోలవరం తీరంలో గల్లంతైన విద్యార్థి మృతి చెందాడని, కాకినాడ జిల్లా తొండంగి మండలం వేమవరం తీరానికి అతని మృతదేహం కొట్టుకువచ్చిందని ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. నర్సీపట్నం అయ్యన్న కాలనీ చెందిన కొమ్మోజు రేవంత్(15) రెండు రోజుల క్రితం స్నేహితులతో కలిసి రేవుపోలవరం తీరానికి వచ్చి తీరంలో గల్లంతైన విషయం తెలిసిందే. రేవంత్ మృతదేహం తీరం ఒడ్డుకు రావడంతో మెరైన్ పోలీసులకు సమాచారం అందింది. స్థానిక పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు చెప్పారు.

సొంత భవనంలోకి ఔషధ నియంత్రణ శాఖ

- రూ.45 లక్షలతో జిల్లా డ్రగ్ కంట్రోలర్ కార్యాలయం
- 30 ఏళ్ల తర్వాత నూతన భవనం ఏర్పాటు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా జీవించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేయడంతోపాటు, రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను దశల వారీగా అభివృద్ధి చేయడం శుభపరిణామమని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ఖీశెట్టి వరాహ సత్యవతి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన ఔషధ తనిఖీ భవనాన్ని చైర్‌పర్సన్ సత్యవతి, 81, 82వ వార్డుల కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య, మందపాటి సునీత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా ఔషధ తనిఖీ భవనం ప్రైవేట్ భవనాల్లో ఉండేదని, జిల్లా ఏర్పడిన తర్వాత శాశ్వత భవనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. గుంటూరు నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని ఈ భవనాన్ని ప్రారంభించిందన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ కొన్ని మెడికల్ షాపుల్లో కాలంచెల్లిన మందులు అంటగడుతున్నారని, రోగుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు షాప్ యజమానులు తమ వద్ద మెడిసిన్ తేదీలు పరిశీలించాలని సూచించారు. కొన్ని రకాల మందులు వైద్యులు సూచనల మేరకు ఇవ్వాలన్నారు. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైద్యుడు, ఎంపీ భర్త కాండ్రేగుల విష్ణుమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో కొత్తగా కొన్ని రకాలైన వ్యాధులను చేర్చారని, వాటికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల వ్యాధులతో చికిత్స పొందుతూ ఇంటి వద్దనే నివసిస్తున్న రోగులకు ఆరోగ్య కార్యకర్తలు ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఔషధ నియంత్రణ అధికారి అభిప్రియ మాట్లాడుతూ జిల్లాలో పది మండలాల్లో 563 మెడికల్ షాపులు ఉన్నాయని, అనకాపల్లి, నర్సీపట్నం ఆస్పత్రుల్లో బ్లడ్ నిల్వ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. దశల వారీగా మెడికల్ షాపులు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జనరల్ డ్రగ్‌ను అన్ని మందుల దుకాణాల్లో రోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. దుకాణ యజమానులు వైద్యులు చీటీపై మాత్రమే మందులు అందజేయాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఔషధ నియంత్రణ అధికారి కల్యాణి, 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, అనకాపల్లి ప్రైవేట్ మందుల దుకాణ షాప్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు వంకాయల ఈశ్వరరావు, కార్యదర్శి పెంటకోట శివ, కోశాధికారి వై.పరమేశ్వరరావు, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సత్యవతి, కార్పొరేటర్లు లక్ష్మీసౌజన్య, సునీత

సారా బట్టీలపై పోలీసుల దాడులు



బెల్లం పులుపు డ్రమ్‌లతో దేవరాపల్లి పోలీసులు

దేవరాపల్లి : నాటు సారా తయారీ బట్టీలపై దేవరాపల్లి పోలీసులు మంగళవారం మెరుపుదాడులు జరిపారు. తామరబ్బ పంచాయతీ శివారు ముకుందపురం, పాతబొడ్డపాడు గ్రామాలలో రైవాడ జలాశయానికి ఆనుకొని నాటు సారా బట్టీలు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర తన సిబ్బంది రాము, గౌరినాయుడు, సూరిబాబులతో కలిసి సారా బట్టీలపై దాడి చేశారు. నాటు సారా తయారీకి సిద్ధం చేసిన 5వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. బట్టీలతో పాటు సారా తయారీకి ఉపయోగించిన సామాగ్రిని సైతం తగులబెట్టారు.

విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురికావొద్దు



ఎస్పీ గౌతమిసాలితో వైద్యులు శ్వేత, లావణ్య

- నిత్యం వ్యాయామం, క్రీడలతో ఆరోగ్యంగా జీవించవచ్చు

అనకాపల్లిటౌన్ : పోలీస్ ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడినదని, ఆరోగ్యంపై ఎక్కువ దృష్టిపెట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ భార్య, వైద్యురాలు ఎం.శ్వేత అన్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం పోలీసులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎస్పీ గౌతమి సాలి ఆధ్వర్యంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా పోలీసులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఉద్యోగిని, మహిళ కుటుంబ జీవితంలో వివిధ రకాలైన పరిస్థితులలో విధులను నిర్వర్తిస్తూ ఎంతో శ్రమకు, ఒత్తిడికిలోనై అనారోగ్య సమస్యలకు గురికావలసి వస్తుందన్నారు. నిత్యం వ్యాయమం, అప్పుడప్పుడు క్రీడల ద్వారా జీవితాన్ని ఆరోగ్యంగా మలచుకోవచ్చన్నారు. మానసిక ఒత్తిడికి గురై చిన్నచిన్న సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో హోంగార్డుల నుంచి ఎస్ఐ స్థాయి సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. 40 ఏళ్ల పైబడిన మహిళా పోలీస్‌లకు మామోగ్రామ్ టెస్ట్ ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణ, ఎన్టీఆర్ వైద్యాలయం డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి. మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ వైద్యురాలు మాధురి, జిల్లా పోలీస్ యూనిట్ వైద్యురాలు తబస్సుం అరా, ఎన్టీఆర్ వైద్యాలయం వైద్యులు ప్రతిభ, నీరజ, ఝాన్సీరాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అంబరాన్నంటిన వైఎస్సార్ తీర్థం



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తీర్థంలో మహిళల కోలాటం

- జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందెం విజేత చోడవరం

కశింకోట: హోరాహోరీగా సాగిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీల్లో విజేతగా చోడవరం నిలిచింది. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీర్థం పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఈ పోటీలు నిర్వహించారు. అనకాపల్లి, కశింకోట, మునగపాక, యలమంచిలి మండలాల జనం పెద్ద ఎత్తున తరలి వచ్చి పోటీలను ఉత్సాహంగా తిలకించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 9 గుర్రాలు పాల్గొన్నాయి. వీటిలో చోడవరానికి చెందిన నూకాంబిక వాయుపుత్ర గుర్రం ప్రథమ స్థానాన్ని దక్కించుకుని రూ.9 వేల బహుమతి గెలుచుకుంది. చోడవరం మండలం శ్రీరాంపట్నానికి చెందిన బాలాజీ టాగూర్ గుర్రం ద్వితీయ స్థానంతో రూ.8 వేలు, విశాఖకు చెందిన అబ్బాస్ గుర్రం తృతీయ స్థానంతో రూ.6 వేలు, చోడవరం మండలం గవరవరానికి చెందిన వాసు గుర్రం చతుర్థి స్థానంతో రూ.4 వేలు బహుమతులను గెలుచుకున్నాయి. వీటి నిర్వాహకులకు వైఎస్సార్‌సీపీ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ బహుమతులను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎస్ఐలు ఎ.ఆదినారాయణరెడ్డి, జె.నాగేశ్వరరావు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ మలసాల కిషోర్, పార్టీ నాయకులు గౌస్, అద్దెపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

తీర్థ పురస్కరించుకుని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఉత్సవ కమిటీ చైర్మన్ కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మహిళలు, బాలికల కోలాటాలు ప్రదర్శించారు. ఇవి ఆహూతులను అలరించాయి. తీర్థంలో ఆట వస్తువులు, తినుబండారాల విక్రయాలు జోరుగా సాగాయి. బుర్రకథ, సాంఘిక నాటకం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

జాతీయ స్థాయి పోటీలకు గబ్బాడ విద్యార్థిని

నర్సీపట్నం: జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు నర్సీపట్నం మండలం గబ్బాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాకిరెడ్డి రమణి ఎంపికైంది. పదో తరగతి చదువుతున్న ఆమె గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు కాకినాడ పిఆర్.కాలేజ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థిని రమణి, పీఈటీ నాగేశ్వరరావులను హెచ్ఎం ఆనందరావు, స్కూల్ కమిటీ చైర్మన్ మాకిరెడ్డి వరలక్ష్మి మంగళవారం అభినందించారు.



విద్యార్థిని రమణితో హెచ్ఎం ఆనందరావు, పీఈటీ

ప్రమాద మృతులకు పోస్ట్‌మార్టం

నక్కపల్లి : పాయకరావుపేట మండలం నామవరం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో బొట్టా కృష్ణ, పక్కుర్తి అప్పారావు అలియాస్ చంటి మృతి చెందగా, గొర్ల లక్ష్మినారాయణ, పక్కుర్తి శ్రీను, కొర్రా శ్రీను గాయపడ్డారు. ఈ ఐదుగురు రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుతుండగా ట్యాంకర్ లారీ వారిపైకి దూసుకుపోవడంతో కృష్ణ, చంటి అక్కడికక్కడే మరణించారు.

వారి మృతదేహాలకు మంగళవారం ఉదయం నక్కపల్లి ఆసుపత్రి మార్చురీ వద్ద పోస్ట్‌మార్టం నిర్వహించారు. పాయకరావుపేట సీఐ అప్పలరాజు, ఎస్ఐ జోగారావు నక్కపల్లి ఆసుపత్రికి వచ్చారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు.



ఆస్పత్రి వద్ద పోలీసులు, మృతుల బంధువులు

టెన్త్, ఇంటర్ ఫీజు గడువు 15

తుమ్మపాల : పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫీజు ఫిబ్రవరి 1 నుంచి 15లోపు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నెలలో పరీక్షలు జరగనున్నట్టు పేర్కొన్నారు. గడువలోగా ఫీజు చెల్లించని వారు అపరాధ రుసుం ఒక్కో సబ్జెక్టుకు రూ.25తో 22వ తేదీ వరకు, రూ.50తో మార్చి 3వ తేదీ వరకు ఫీజు చెల్లించుకోవచ్చన్నారు. మార్చి 3 నుంచి 7 వరకు తత్కాల్ ద్వారా అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదోవ తరగతి ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్ థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చొప్పున తత్కాల్ ఫీజు నిర్ణయించినట్లు వెల్లడించారు.

హెచ్‌పీసీఎల్ రూ. 50 లక్షల వైద్యసామగ్రి వితరణ

నాతవరం: ఏటా ప్రజోపయోగ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని హెచ్‌పీసీఎల్ డీజీఎం బి. గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని గునుపూడి పీహెచ్‌సీకి రూ.50 లక్షల విలువ చేసే అల్ట్రాస్కానర్‌తో పాటు పది రకాల సామగ్రిని హెచ్‌పీసీఎల్ సమకూర్చింది. వాటిని మంగళవారం సర్పంచ్ వేముల సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పోలుపర్తి వెంకటరమణల ఆధ్వర్యంలో వైద్యాధికారులు సురేష్‌కుమార్, పద్మప్రియలకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ డీజీఎం మాట్లాడుతూ గతంలో పాఠశాలలకు బెంచీలు, కుర్చీలు అవసరమైన ఫర్నిచర్ అందజేశామన్నారు. హెచ్‌పీసీఎల్ రీజనల్ మేనేజరు ఎ.చిరంజీవి, అసిస్టెంటు మేనేజరు బిందుసాయిరాం, మాజీ సర్పంచ్ పోలుపర్తి చిట్టిబ్బాయ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేముల సూరిబాబు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సామగ్రిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు

రోడ్డు ప్రమాదంలో పెయింటర్‌కు గాయాలు

నర్సీపట్నం : నెల్లిమెట్ట జంక్షన్ వద్ద మంగళవారం కారు-బైక్ ఢీ కొన్న సంఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. నర్సీపట్నం రూరల్ ఎస్ఐ రామారావు అందించిన వివరాలు.. కోటవురట్ల మండలం, చౌడువాడ గ్రామానికి చెందిన ఎస్.జాన్‌కుమార్(27) వృత్తిరీత్యా పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని ముగించుకుని జాన్‌కుమార్ మోటార్‌బైక్ డౌనూరు నుంచి నర్సీపట్నం వస్తున్నాడు. నెల్లిమెట్ట జంక్షన్ వద్దకు ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో యువకుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాధితుడి భార్య భవానీ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మండలంలోని తెనుగుపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శానాపతి ఆనంద్ సత్తాచాటాడు. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖపట్నం జిల్లా జట్టు తరపున ఆడి విశేష ప్రతిభ కనబరిచాడు. అండర్-19 బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని హెచ్ఎం వి.ఉమాశంకర్ తెలిపారు. స్థానిక పాఠశాలలో క్రీడాకారుడు ఆనంద్‌తోపాటు పీడీ డి. నర్సింగరావును హెచ్ఎం ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థి ఆనంద్‌ను అభినందిస్తున్న హెచ్ఎం ఉమాశంకర్, పీడీ నర్సింగరావు

చోరీ కేసులో నలుగురు అరెస్టు

కోటవురట్ల : కైలాసపట్నంలోని ఓ ఇంట్లో జరిగిన చోరీని పోలీసులు ఛేదించారు. దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. నక్కపల్లి సీఐ నారాయణరావు, ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం 2022 డిసెంబరు 25వ తేదీన కైలాసపట్నంలోని ఓ ఇంట్లో నలుగురు యువకులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లభించిన ఆధారాలతో పెదబొడ్డేపల్లికి చెందిన నలుగురు యువకులు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వారిని అరెస్టు చేసి, 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. వీరిలో ఒకరు మైనరు ఉన్నట్టు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో సీఐ నారాయణరావు, ఎస్ఐ నారాయణరావు

నవభారత నిర్మాణంలో వర్సిటీలే కీలకం

- పటిష్టమైన ఉన్నత విద్యావ్యవస్థతో అభ్యున్నతి సాధ్యం
- యువతలో పరిశోధనపై ఆసక్తి పెంపొందించాలి
- సౌత్‌జోన్ వీసీల సదస్సులో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపు



కార్యక్రమానికి హాజరైన ఉపకులపతులు



ఏఐయూ సంచికను ఆవిష్కరిస్తున్న గవర్నర్

ఏయూక్యాంపస్: ఆత్మనిర్బర్ భారత్‌ను సాకారం చేస్తూ.. నవ్యభారతావని నిర్మాతలను తీర్చిదిద్దే బాధ్యతను విశ్వవిద్యాలయాలు స్వీకరించాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సౌజన్యంతో ఏయూ నిర్వహిస్తున్న సౌత్ జోన్ వైస్ చాన్సలర్స్ మీట్ 2023 'రీసెర్చ్ అండ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' సదస్సును గవర్నర్ ప్రారంభించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఉపకులపతులనుద్దేశించి మాట్లాడారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా విద్య రంగం వృద్ధి, ఉపాధి అవకాశాలు పెంపు, మెరుగైన వైద్య సేవలు దేశంలో పెరుగుతున్నాయన్నారు. దేశ అభివృద్ధికి ఉన్నత విద్య ఎంతో ప్రధానమైన అంశం అన్నారు. భవిష్యత్ నాయకులు తయారు చేయడానికి జ్ఞానం, అధునాతన నైపుణ్యాలను అందించడం ద్వారా దేశ నిర్మాణం చేయాలన్నారు. దీని ఫలితంగా బలమైన సామాజిక ఆర్థిక వ్యవస్థను నిర్మించడం వీలవుతుందన్నారు. నూతన విద్య విధానంలో భాగంగా పరిశోధనలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. పరిశోధన రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌లో అత్యుత్తమ స్థానంలో భారతీయ విశ్వవిద్యాలయాలు స్థానం సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో పరిశోధన ఆలోచనలు, ఆసక్తిని పెంచే విధంగా వీసీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా, అంతర్జాతీయంగా అనుసంధానం చేస్తూ తీర్చిదిద్దుతున్నామన్నారు. ఏయూలో నెలకొల్పిన టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ 34 స్టార్టప్‌లకు వేదికగా నిలుస్తోందన్నారు. నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 17 స్టార్టప్‌లను తీర్చిదిద్దిందన్నారు. అవంతి ఫీడ్స్‌తో ఏర్పాటు చేసిన స్కిల్ సెంటర్, ఫుడ్ ప్రాసెసింగ్, టెస్టింగ్ ఇంక్యుబేషన్ సెంటర్, ఫార్మా టెస్టింగ్ లేబొరేటరీ, మెడికల్ జెనిటిక్స్ రీసెర్చ్ సెంటర్, టికాక్స్‌తో విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) ఫోర్ స్టార్ రేటింగ్ సాధించడం గర్వంగా ఉందన్నారు. సెయింట్ లూక్స్ సంస్థతో ఏర్పాటు చేస్తున్న మ్యూజిక్ ప్రొడక్షన్ స్టూడియో, ఐఐఎం విశాఖపట్నంతో నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, విభిన్న పరిశ్రమల సహకారంతో ఏర్పాటైన 18 చెయిర్ ప్రొఫెసర్లు, 1000 దాటిన విదేశీ విద్యార్థుల సంఖ్య ఏయూ గర్వకారణమన్నారు.

అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ అధ్యక్షుడు ఆచార్య సురంజన్ దాస్ మాట్లాడుతూ ఉన్నత విద్యను ఆంగ్లంతో పాటు స్థానిక భాషల్లో అందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రవేశాల జీఈఆర్‌ను 27.4 నుంచి 37.2 శాతానికి వృద్ధి చేసినట్లు చెప్పారు. ఐదు నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా పనిచేస్తున్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ఫలితంగా ఇంటర్ తర్వాత విద్యను ఆపివేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఏఐయూ సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ 98 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఏఐయూలో 924 విశ్వవిద్యాలయాలు సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. దేశంలో పరిశోధనలు, పేటెంట్ల సంఖ్య మరింత పెరగాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి సిసోడియా, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు కె.రామ్మోహనరావు, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సదస్సు నిర్వాహకులు ఆచార్య కె.రాంజీ, ఆచార్య బి.మోహన వెంకట రామ్, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, డాక్టర్ ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ, ఏఐయూ తరపున గవర్నర్‌కు జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. కార్యక్రమం ఆరంభంలో ఏయూ సంగీత విభాగం విద్యార్థులు నృత్య ప్రదర్శనలో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు.

క్లుప్తంగా

'మెరుగైన వైద్యానికి కృషి'

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రభుత్వం కొత్తగా నియమించిన నలుగురు సభ్యుల అభివృద్ధి కమిటీ ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వైద్యాలయానికి పూర్వ వైభవం రావాలంటే సిటీస్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ తదితర యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కేజీహెచ్‌కు దీటుగా ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

తుమ్మపాల : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని జేఎంజే ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నక్షత్రం, ప్రధానోపాధ్యాయురాలు మేరీ మంజుల అన్నారు. పాఠశాలలో మంగళవారం జరిగిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలపై అందరికి మక్కువ ఉంటుందని, ప్రతి రోజు కనీసం కొంత సమయమైనా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. పాఠశాలలో ఖోఖో, వాలీబాల్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్ర, ఒరిస్సాలోని జేఎంజే సంస్థల పాఠశాలలు పాల్గొన్నాయి.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలో విద్యుత్ వైర్ల కింద జంగిల్ క్లీనింగ్‌తోపాటు, పాడైన ఇనుప స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఫిబ్రవరి 2న ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రమణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కశింకోట ఎస్ఎస్ నుంచి బైపాస్ జంక్షన్, ఉమ్మలాడ బంక్ రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, శారదా కాలనీ, తహసీల్దార్ కార్యాలయం రహదారి, ఉడ్‌పేట, న్యూకాలనీ, రావుగోపాలరావు కళాక్షేత్రం రహదారి, జీవీ కోటేశ్వరరావు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులతో సహకరించాల్సిందిగా ఆయన కోరారు.


సొంత స్థలంలో జగనన్న ఇళ్లు

కశింకోట : కశింకోట గ్రామంలో సొంత స్థలం ఉండి జగనన్న గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారు సంబంధిత సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి, ఇళ్లు మంజూరు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
సిందూరం	-సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 8,132 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,520	4,100
మొదటి రకం	3,180	3,430
రెండో రకం	2,960	3,430
మూడో రకం	2,860	2,950

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు , బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

'గ్యాస్ సిలిండర్' అదనపు వసూళ్లకు చెక్

- ఒక్కో సిలిండర్‌కు రూ.50 చెల్లించాల్సిందే
- మండలంలో అదనపు వసూళ్లు రూ.22.50 లక్షలు
- ప్రభుత్వ తాజా ఉత్తర్వులపై ప్రజల్లో అవగాహన



ఆటోపై ఇంటి వద్దకు తరలిస్తున్న గ్యాస్ సిలిండర్లు

తుమ్మపాల : ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీల పేరిట జరిగే అక్రమ వసూళ్లకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొన్ని నిబంధనలను జారీ చేసింది. గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ చార్జీల పేరిట ఇష్టారీతిన వసూలు చేయడంపై ప్రజల్లో ఎప్పటి నుంచో ఆక్షేపణలున్నాయి. గత ప్రభుత్వాలు దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం వీటిపై స్పష్టమైన ఆదేశాలిస్తూ, అదనపు వసూళ్లకు పాల్పడే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేసింది.

దూరాన్ని బట్టి చార్జీలు

గ్యాస్ ఏజెన్సీ నుంచి 5.కి.మీ. దూరం వరకు ఎలాంటి చార్జీలు వసూలు చేయకూడదు. 5 కి.మీ. నుంచి 15 కి.మీ. వరకు కేవలం రూ.20 మాత్రమే తీసుకోవాలి. గ్యాస్ ఏజెన్సీ నుంచి దూరం 15 కి.మీ. దాటితే మాత్రం సిలెండర్‌కు రూ.30 వసూలు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీలకు కల్పించింది. అంతకు మించి ఒక్క రూపాయి కూడా తీసుకోవడానికి వీల్లేదు.

ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబర్

వంట గ్యాస్ డెలివరీ బాయ్స్ సిలిండర్ డెలివరీకి బిల్లులో ఉన్న మొత్తం కన్నా అదనంగా డబ్బులు అడిగితే వినియోగదారులు కాల్ సెంటర్/టోల్ ఫ్రీ నెంబర్ 1967, 18002333555కు ఫిర్యాదు చేయొచ్చు. వినియోగదారులు సిలండర్ డెలివరీ బిల్లులో ఉన్న ధర మాత్రమే చెల్లించాలి. 5 కి.మీ.లోపు ఎలాంటి అదనపు మొత్తం చెల్లించాల్సిన పనిలేదు.

వసూళ్లు రూ.22 లక్షలకు పైనే

అనకాపల్లి మండల పరిధిలో 32 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో సుమారు 45 వేల గ్యాస్ కనెక్షన్లున్నట్టు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో సగటున రెండు మాసాలకోసారి సిలండర్లు బుక్ చేసుకుంటారని ఏజెన్సీ నిర్వాహకులు చెప్తున్నారు. ఇలా చూసినా.. ఒక్కో సిలెండర్‌కు రూ.50 చొప్పున ఏకంగా రూ.22.50 లక్షల వరకు వినియోగదారుల జేబుకు చిల్లు పడుతోందని అంచనా. కొన్ని చోట్ల ఏజెన్సీ నిర్వాహకులకు కూడా ఈ వసూళ్లలో వాటా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. చాలా వరకు ఈ మొత్తం గ్యాస్ డెలివరీ బాయ్స్ జేబుల్లోకే చేరుతుందనడంలో సందేహం లేదు.

తప్పనిసరి కాదు.. అయినా..!

పట్టణంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీలకు మండలంలోని అన్ని గ్రామాలు దాదాపు 10 కి.మీ. పరిధిలోపే ఉన్నాయి. అయినప్పటికీ డెలివరీ చార్జీల పేరుతో ఒక్కో గ్యాస్ సెలిండర్‌పై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నట్టు స్థానికులు చెప్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై గ్యాస్ ఏజెన్సీలు ఎంతమేరకు సహకరిస్తాయన్నది కూడా ప్రశ్నార్థకమే. డెలివరీ బాయ్స్‌కు అదనంగా ఇవ్వాలని ఏనాడూ.. తాము చెప్పట్లేదని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వాదన. వినియోగదారులే ఇస్తున్నారు తప్ప.. తమ నిర్బంధం లేదంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు డెలివరీ బాయ్స్‌కు జీతాలు చెల్లిస్తున్నట్టు చెప్తున్నారు. డెలివరీ బాయ్స్ వాదన మరోలా ఉంది. సిలిండర్‌పై జనాలిచ్చేదే తప్ప, ఏజెన్సీ నిర్వాహకులు తమకు జీతాలు పెద్దగా ఇవ్వరని, వాటితో తామెలా బ్రతికేదని చెప్తున్నారు.

రూ.50 చెల్లించాల్సిందే..!

గ్యాస్ బుక్ చేసుకున్న కొద్ది రోజులకే ఇంటికి గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ బాయ్ తెస్తున్నాడు. బిల్లులో ఉన్న మొత్తంతోపాటు అదనంగా ఒక్కో బండకు రూ.50 తీసుకుంటున్నారు. ఇక నుంచి అదనపు చార్జీలు చెల్లించక్కర్లేదన్న ప్రభుత్వ నిర్ణయం చాలా మంచిది. ఇది పక్కాగా అమలయ్యేలా చూడాలి.

– కె.లక్ష్మి, గృహిణి, రేబాక

బీజేపీ జిల్లా కార్యాలయం ప్రారంభం నేడు



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్ : స్థానిక చదువులవారివీధిలో బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వైద్యుడు జీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన ద్వారపురెడ్డి పరమేశ్వరరావు బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కార్యవర్గ సమావేశం, సాయంత్రం 5 గంటలకు స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో డేటా మేనేజ్‌మెంట్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కర్రి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఉడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యవరంలో 'గడప గడపకు' నేడు

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్వల్ప మార్పు జరిగిందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమం బుధవారం ఉదయానికి బదులు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును తెలుసుకోవడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక అధికారులు హాజరుకావాలని కోరారు.

సంపద కేంద్రాలను తనిఖీ చేసిన డీపీవో



సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీవో శిరీషారాణి

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లోని సంపద కేంద్రాలను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యం చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని తీసుకురావడమే దీని ఉద్దేశమన్నారు. ఆమె వెంట ఈవోఆర్డీ ధర్మారావు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి



మాట్లాడుతున్న ఎస్ఐ అలీ

మునగపాక : కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మెలగాలని మునగపాక ఎస్ఐ మహ్మద్ అలీ కోరారు. మండలంలోని మెలిపాక దళితవాడలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

దళితవాడల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో అన్ని కులాల వారు సోదరభావంతో మెలగాలన్నారు. అంటరానితనం రూపు మాపేందుకు పాటుపడాలన్నారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ గుంట్ల అప్పారావు, దళిత విభాగం మండల అధ్యక్షుడు మందా రాము, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శ్రీనివాసరావు, దళితులు అనిల్‌కుమార్, బీలా శివగణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జోనల్ మలేరియా అధికారి సందర్శన



గంటవానిపాలెంలో పర్యటిస్తున్న జోనల్ మలేరియా అధికారి మధుసూధనరావు

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విశాఖ జిల్లా జోనల్ మలేరియా అధికారి మధుసూదనరావు కోరారు. మండలంలోని గంటవానిపాలెంలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో మలేరియా సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ మలేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి దొర, సబ్ యూనిట్ అధికారి శ్రీను, చూచుకొండ పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో కృష్ణ, వైద్య సిబ్బంది నాయుడు, కృష్ణ, పార్వతి పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు నేడు

మునగపాక : మునగపాక గౌరీ పరమేశ్వరుల పండగ సందర్భంగా బుధవారం సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, గౌరవ అధ్యక్షుడు పొలిమేర అప్పలనాయుడు, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడులు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న జరగనున్న ఉత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గ్రామంలోని అన్ని వీధుల గుండా డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు జరుగుతుందన్నారు. గ్రామంలోని వందలాది మహిళలు, తమ ఇళ్లల్లో తయారు చేసిన సంప్రదాయ పిండి వంటలు, గౌరీపరమేశ్వరులకు మొక్కుబడులుగా సమర్పించనున్న కొత్త వస్త్రాలను నెత్తిన పెట్టుకుని పుర వీధుల్లో భారీ ఊరేగింపుగా అమ్మవారికి నివేదించనున్నారు.

బీమా చెక్కుల పంపిణీ



బీమా చెక్కు అందజేస్తున్న విశాఖడెయిరీ జెడ్ఎం రమణ

మునగపాక: ప్రతి ఒక్కరూ విశాఖడెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డెయిరీ జోనల్ మేనేజర్ శరగడం రమణ కోరారు. మండలంలోని ఒంపోలు పాలకేంద్రం ఆవరణలో ముగ్గురు పాడి రైతులకు రూ.90వేల బీమా చెక్కులను మంగళవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి, సూపర్‌వైజర్ ఆదిఅప్పారావు, వేతన కార్యదర్శి నాయుడప్ప పాల్గొన్నారు.

వందేమాతరం బస్సు సర్వీస్ అవాస్తవం

అనకాపల్లిటౌన్ : వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తున్న అనకాపల్లి–విశాఖపట్నం వందేమాతరం బస్సు నడుపుతున్నట్టు వచ్చిన ప్రచారాన్ని నమ్మవద్దని స్థానిక డిపో మేనేజర్ సుజాత మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఇటువంటి తప్పుడు ప్రచారాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త సర్వీసులు నడిపేటపుడు మీడియా ద్వారా తామే అధికారికంగా సమాచారం అందిస్తామని పేర్కొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో లెప్రసీ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కుష్టు వ్యాధిపై అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జి.రజని, ఎంఎస్‌వో సీహెచ్ శివకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్టూరులో మోదకొండమ్మ పాద ప్రతిష్ట



మోదకొండమ్మ పాదాలకు పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : మండలంలో మార్టూరు గ్రామంలో మంగళవారం శ్రీ మోదకొండమ్మ పాద ప్రతిష్ట జరిగింది. వీటిని గ్రామంలోని మెట్టపైన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు అప్పారావు, శ్రీను, రాజులు మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో త్వరలో అమ్మవారి ఆలయం నిర్మాణానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కశింకోటలోని హెల్త్ క్లినిక్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు యశోద

కశింకోట : కశింకోటలోని 3వ సచివాలయ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యురాలు యశోద గర్భిణులు, రోగులను పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. శ్మశాన వాటిక, జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారి పరిసరాలు, పలు వీధుల్లోను పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలలో పూడికలు తీయించి, చెత్తను తొలగింపజేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని కోరారు.

అనకాపల్లి జేసీ దాతృత్వం



చికిత్స పొందుతున్న గవర శారద

సబ్బవరం: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై రేబాక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో గాయపడిన మహిళను జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి తన కారులో సబ్బవరం పీహెచ్‌సీకి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సబ్బవరం మండలంలోని టెక్కలిపాలెం శివారు నాయనమ్మపాలేనికి చెందిన గవర శారద తన భర్త గంగరాజుతో కలిసి అనకాపల్లి మండలంలోని శంకరంలో జరిగిన వీరాంజనేయ స్వామి తీర్థానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి మంగళవారం రాత్రి స్వగ్రామం వస్తుండగా రేబాక సమీపంలో స్పీడ్ బ్రేకర్ ఎక్కిస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో జారిపడిన గవర శారదకు గాయాలు అయ్యాయి. ఆ సమయంలో అటుగా సబ్బవరం వైపు వెళ్తున్న జేసీ తన కారులో సబ్బవరం పీహెచ్‌సీకి తరలించారు.అక్కడ వైద్యులకు ఫోన్‌చేసి దగ్గర ఉండి వైద్యం చేయించారు. అవసరం అయితే తనకు ఫోన్ చేయాలని వారికి నెంబర్ ఇచ్చిఅనంతరం అక్కడ నుండి బయలుదేరి వెళ్లిపోయారు.

ఘనంగా గంగదేవి తల్లి ఉత్సవం



జి.భీమవరంలో గంగదేవితల్లికి పూజలు



దర్శనానికి బారులుతీరిన ప్రజలు

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో మంగళవారం గంగదేవితల్లి ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయానికి భక్తులు పోటెత్తారు. గంటల తరబడి బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏటా జరిగే గంగదేవితల్లి ఉత్సవం పురస్కరించుకుని అమ్మ వారిని పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. మండల గ్రామాలతోపాటు మాకవరపాలెం మండలం, పరిసర గ్రామాల నుంచి కూడా ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, తాళ్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, జి.భీమవరం సర్పంచ్ వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కరణం లోవరాజు, చింతలపాలెం సర్పంచ్ కొట్టి రాము తదితరులు దర్శించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్ తదితరులు ఆయన వెంట పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

అ'పూర్వ' కలయిక



బీఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఏఎంఏఎల్ కళాశాలలో 1978–81 బ్యాచ్‌కు చెందిన బీఎస్సీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మంగళవారం జరిగింది. మనుమలు, మనుమరాళ్లతో సంపూర్ణ జీవితాన్ని ఆస్వాదిస్తున్న వీరు 45 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకునేందుకు జార్జిక్లబ్ వేదికగా మారింది. ఒకరినొకరు కుశలప్రశ్నలు.. జీవితంలో పొందిన విజయాలు.. విద్యార్థి జీవితంలో మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా చేసి పదవీవిరమణ పొందారు. మరి కొందరు న్యాయవాదులు, కాంట్రాక్టర్లుగా ఇంకా బిజీ జీవితాన్నే సాగిస్తున్నారు. తమ మిత్రుల్ని కలుసుకున్నామన్న ఆనందం వీరిని ఉదయమంతా ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆత్మీయ కలయికకు రానివారిని, రాలేని వారిని ఆరా తీసి, సమస్యల్లో ఉన్నవారికి తమ వంతు సాయపడాలని తీర్మానించుకున్నారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపి, ఆ అనుభూతులతో తిరుగుముఖంపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పరవాడ: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడతారని అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని ఫార్మాసిటీలోని ఎం.ఎ.ఎస్.ఆర్.ఎం కార్యాలయం వద్ద వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెట్టి సుబ్బారావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, ఫార్మా పరిశ్రమల వాహనచోదకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని సరస్వతి

సబ్బవరం: మండలంలోని సబ్బవరం నుంచి వంగలి వెళ్తున్న రోడ్డులో మంగళవారం ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని వంగలి గ్రామానికి చెందిన సరస్వతి, గవర రమాదేవి, మాటూరి ప్రవల్లిక, కోన వెన్నెల, గవర సాగర తదితరులు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు.వీరంతా కళాశాల ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటల సమయంలో వంగలి ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ఆటో టి. జంగాలపాలెం సమీపంలోని ఇటుకుల బట్టీ వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు ఆటోలు బోల్తా పడ్డాయి. ఈ ఘటనలో కోన సరస్వతికి రెండు కాళ్లు విరిగిపోగా, కోన వెన్నెల నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్వర చికిత్సతో కుష్టు నివారణ



తోటాడలో కుష్టువ్యాధి నివారణ ర్యాలీ

మునగపాక : కుష్టు రోగులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు కోరారు. మంగళవారం తోటాడ పంచాయతీలో కుష్టువ్యాధి నివారణ ర్యాలీ నిర్వహించారు. శరీరంపై మచ్చలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స తీసుకుంటే అంగవైకల్యం లేకుండా బయటపడవచ్చన్నారు. ఆరోగ్య వికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మి, కేంద్రం నిర్వాహకులు ప్రియాంక, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సత్కారం



చిరంజీవిరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్, సహచర అధ్యాపకులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో అధ్యాపకుడి పనిచేస్తున్న డాక్టర్ వేపాడ చిరంజీవిరావు మంగళవారం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శంకర్ మిగిలిన అధ్యాపకులతో కలిసి మంగళవారం కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఇంకా 12 సంవత్సరాల సర్వీసు ఉండగానే స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయడం విద్యార్థులకు తీరని లోటని ప్రిన్సిపాల్ అన్నారు.